# సిపిఐ(ఎం)కు ఓటెయ్యండి

## వామపక్షాల్ని బలపర్చండి

# ధరల పెరుగుదల అరికట్టేందుకు, ఆహార అభద్రత నివారించేందుకు

16వ లోక్‌సభ ఎన్నికల ప్రచార కరపత్రం 2014

**ప్రతి నిమిషం అయిదుగురు భారతీయులు ఆకలితో చనిపోతున్నారు... అంటే రోజుకు 7000 మంది, ఏడాదికి 25 లక్షల మంది. ఇదీ ఇండియా గ్రోత్ స్టోరీ చెప్పే కఠోర వాస్తవం.**

*(ద వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం- ఐరాస ఏజెన్సీ)*

ఆహార కొరత, ఆకలి, ఆహారపదార్థాల ఆహారేతర నిత్యావసరాల ధరల భారం... ఇవి మనకు నిత్యసమస్యలుగా మారాయి. 1990ల నుంచి దాపురించింది మనకు ఈ దుస్థితి. దీనికి కారణం... కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, అంతకు ముందు బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాలు అనుసరించిన నయా ఉదారవాద విధానాలు. '90ల తొలినాళ్ల వరకు అమలులో ఉన్న సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను ఈ కాలంలో ఒక ప్రణాళిక ప్రకారం బలహీన పరిచారు. సంవత్సరాలు గడిచే కొద్దీ ఈ వ్యవస్థను అంతమొందించారు. ఆకలి, అధిక ధరలు.. వీటిలో రికార్డు సృష్టించడానికి ఇండియా ఈనాడు అంతర్జాతీయంగా పోటీ పడుతోంది. ఆఖరుకు అత్యంత బీదరికం తాండవించే ఆఫ్రికా సబ్-సహారా దేశాలలో కంటే ఇక్కడే ఆకలి ద్రవ్యోల్బణం ఎంతో ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు ప్రపంచంలో కెల్లా అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ ఘనత మూటగట్టుకుంది.

## పడగ విప్పుతున్న ద్రవ్యోల్బణం

విరామం అంటూ లేకుండా పెరిగిపోతున్న ఆహారపదార్థాల ధరలను ఇతర నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయలేని అసమర్ధత కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం తీవ్ర వైఫల్యాలలో ఒకటి. 2007 నుంచి వరుసగా ఏడేళ్ల పాటు యావత్ భారతదేశం రెండంకెలకు దిగని ఆహార ద్రవ్యోల్బణంతో దుర్భర జీవనం గడుపుతోంది. దీని పర్యవసానంగా, అన్ని వస్తుసేవలకు వర్తించే వినియోగదారుల ధరల సూచీ, టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణాలు అధికంగా ఉంటున్నాయి. ప్రత్యేకించి

కూరగాయల ధరలు అత్యధికంగా ఉన్నాయి- ఉల్లిగడ్డలు, బంగాళ దుంపల ధరలు ఒక టైములో కె.జి 100 రూపాయలు దాటాయి.

వినియోగ ధరల సూచీ (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) ప్రకారం లెక్కించే ద్రవ్యోల్బణం ఎక్కువ కాలం 9శాతం పైనే కొనసాగింది. గడచిన కొద్ది నెలలుగా అంతర్జాతీయంగా ఆహార పదార్థాల ధరలు పడిపోయినప్పటికీ, ఇండియాలో వాటి ధరలు పెరిగాయి. జి-20 దేశాలలో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం రేటు అత్యధికంగా ఉన్నది ఇండియాలోనే. ఇతర ఆసియా దేశాలలోనూ మనమే అగ్రస్థానం. బ్రెజిల్, రష్యా, సౌత్ ఆఫ్రికా, చైనా, భారత్‌లతో కూడిన బ్రిక్స్ దేశాల నడుమా ఇండియాలోనే అత్యధిక స్థాయిలో ధరల సూచీ ఉంది.

**వినియోగ ధరల సూచీ**

## బ్రిక్స్ దేశాలు

| | |
|---|---|
| బ్రెజిల్ | 6.1 |
| రష్యా | 6.5 |
| సౌత్ఆఫ్రికా | 6.4 |
| చైనా | 2.6 |
| ఇండియా | 10.7 |

## జి-20 దేశాలు (ఆసియా)

| | |
|---|---|
| జపాన్ | 0.9 |
| కొరియా | 1.5 |
| చైనా | 2.6 |

| | |
|---|---|
| సౌదీ అరేబియా | 3.7 |
| ఇండోనేసియా | 8.5 |
| ఇండియా | 10.7 |

-----------------------------------------

**(ఐఎంఎఫ్ గణాంకాలు 2013)**

కాబట్టి, ఇది ప్రపంచమంతటా జరుగుతున్నదే అని ప్రభుత్వం చెప్పడం పూర్తిగా బోగస్. ప్రపంచ బ్యాంకు గణాంకాలే ఈ విషయం రుజువు చేశాయి. ఇతర జి-20 దేశాల కంటే భారత ప్రజలు అధిక ధరల వల్ల ఎక్కువ ఇబ్బంది పడ్డారు.

పేద వర్గాల ప్రజల విషయానికి వస్తే, వారి జీవితాల మీద ధరల పెరుగుదల ప్రభావం మరీ ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ కార్మికులకు వర్తించే వినియోగ ధరల సూచీ( సీపీఐ-ఎఎల్) వెనుదిరిగి చూడకుండా పెరిగింది. 2010-2013 మధ్య గడచిన మూడేళ్లలో ఈ పెరుగుదల 34.08 శాతం ఉంది.

ఓ వైపు ఆహార వస్తువుల, ఆహార ధాన్యాల ధరల్లో పెరుగుదల కళ్ల ముందే అడ్డుఅదుపూ లేకుండా పెరుతూ ఉంటే, తాము ద్రవ్యోల్బణం అదుపు చేయడంలో గొప్ప విజయం సాధించామని యూపీఏ ప్రభుత్వం నిస్సిగ్గుగా చెప్పుకుంటోంది. ద్రవ్యోల్బణం 5.05 శాతానికి తగ్గిందని టోకు ధరల సూచీ ( ఈ ధరలు వినియోగదారులు చెల్లించేవి కావు, సామాన్యుడికి ఇవి అసంగతమైనవి) ఆధారంగా మోసపూరిత ప్రకటనలు చేయడం సామాన్యులను ప్రభావితం చేసే వాస్తవ ధరల పెరుగుదలను కప్పిపుచ్చడానికి చేసే రాజకీయ గారడీ మాత్రమే అవుతుంది. వాస్తవ స్థితిని కొంత మెరుగ్గా ప్రతిబింబించేది వినియోగ ధరల సూచీ (సామాన్యుడు వాస్తవంగా చెల్లించే చిల్లర ధరలు). ఏమైనప్పటికీ, టోకు ధరల సూచీ ప్రకారం ద్రవ్యోల్బణ రేటు కొద్దిగా తగ్గి ఉండొచ్చు. అయితే దానర్థం టోకు ధరలు తగ్గాయని కాదు, ధరలు నిదానంగా పెరిగాయని మాత్రమే.

**ధరల పెరగడానికి ప్రజల్ని నిందించడం తప్పు.** యూపీఏ ప్రభుత్వం ప్రజల్ని మోసగించాలని ప్రయత్నించింది, ప్రజల నుంచి మితిమీరిన గిరాకి రావటమే ధరల

నిరంతరాయ పెరుగుదలకు కారణమని చెబుతూ వాటిని అదుపు చేయడంలో తన ఘోర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవాలని, ప్రజలను మోసగించాలని యూపీఏ ప్రభుత్వం ప్రయత్నించింది. 77 శాతం ప్రజల ఖర్చు రోజుకు రూ. 20 కంటే తక్కువగా ఉన్న ఈ దేశంలో, ఇలాంటి ప్రకటన సిగ్గుమాలిన తనమే కాదు.. పుండుపై కారం చల్లడమే.

నిజానికి పెట్రోలు డీజిలు ధరలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలు, విద్యుత్ చార్జీలు, రవాణా చార్జీలు ఇలా అనేక వస్తుసేవల ధరలు పెంచుతూ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల ఫలితమే ద్రవ్యోల్బణం. సబ్సిడీలలో కోతలు వ్యయ విజృంభణ ద్రవ్యోల్బణం (కాస్ట్ పుష్ ఇన్‌ఫ్లేషన్) తెచ్చిపెట్టాయి. ఆహార ధరల మీద "క్యాస్కేడింగ్ ఎఫెక్ట్" (పరోక్ష ప్రభావం) పడింది.

ఆయిలు కంపెనీల "సూపర్ ప్రాఫిట్"ను పెంచడమే పరమార్థంగా పెట్రోలు, డీజిలు ధరలపై నియంత్రణ ఎత్తేస్తూ నిర్ణయం తీసుకున్నందువల్ల, ఆ చర్య వాటి ధరలు నిరంతర పెంపునకు దారితీసింది. దాంతో రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం, రిటైల్ వ్యయం పెరిగాయి. యూపీఏ హయాంలో పెట్రోలు ధర 18 సార్లు పెంచారు. డీజిలు ధరలు యూపీఏ రెండు టర్మ్‌లలోనూ కలిపి 2004 జనవరి నాటి రూ. 20 నుంచి 2013 డిసెంబరులో రూ. 55కి (ఢిల్లీ ధరలు) పెరిగి దాదాపు మూడింతలైంది. పెట్రోలు ధర 2004 జూన్‌లో రూ. 35 ఉండగా 2013 డిసెంబరు నాటికి రూ. 70 దాటి (ఢిల్లీ ధరలు) రెండింతలైంది. అంతర్జాతీయ ధరలు పెరుగుతున్న ఫలితమే ఈ అధిక ధరలని ప్రభుత్వం మరో అభూత కల్పనను వ్యాపింప చేయడానికి ప్రయత్నించింది. వాస్తవం ఇందుకు భిన్నంగా ఉంది. ఈ సంవత్సరాలలో విధించిన కస్టమ్స్ సుంకం, సెన్‌వాట్, ఎక్సయిజ్ సుంకం, ఇంకా ఇతరత్రా వివిధ రాష్ట్ర కేంద్రప్రభుత్వాల పన్నులు వెరసి పెట్రోలు మౌలిక ధరను 40–66 శాతం పెంచాయి. అలాగే డీజిలు ధర కూడా ఇదే కారణంతో 20–30 శాతం పెరిగింది.

డాలర్‌తో ఇతర ప్రధాన కరెన్సీలతో రూపాయి మారకపు రేటు పతనమవుతూ ఉంటే ప్రభుత్వం వహించిన ఉదాసీనత కూడా ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణమైంది.

దీనివల్ల ఇండియా విదేశాల నుంచి చమురును ఎరువులను అధిక రేట్లు చెల్లించి దిగుమతి చేసుకోవలసి వచ్చింది. విదేశాల నుంచి విలాస వస్తువులను, బంగారాన్ని దిగుమతి చేసుకోడానికి ధనిక వర్గాల నుంచి వచ్చిన డిమాండ్‌ను అంగీకరించడం వల్ల విదేశీ మారక ద్రవ్యం వినియోగించడానికి అనుమతించడం వల్ల వర్తమాన ఖాతా (కరెంట్ అకౌంట్) లోటు మరింత పెరిగింది. స్పెక్యులేటివ్ పెట్టుబడుల రాకపోకలపై ఎలాంటి ఆంక్షలు లేకుండా సరళీకరించ వద్దంటూ సిపిఐ(ఎం) పదేపదే చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పెడచెవిన పెట్టడం వల్ల ఈ అనర్థం దాపురించింది. భారత క్యాపిటల్ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) భారీస్థాయిలో నిధులను వెనక్కు తీసుకోడంతో చివరకు రూపాయి మారకపు విలువ కుప్పకూలింది. ఒడిదుడుకుల మార్కెట్‌లో స్పెక్యులేటర్లు పెద్దపెట్టున లాభాలు గడించడానికే ఈ ప్రభుత్వం సహకరిస్తోంది.

అంతే కాదు, బడా వ్యాపారుల స్పెక్యులేషన్‌కు, అక్రమ నిల్వలకు, అంతర్జాతీయ, జాతీయ ఆగ్రిబిజినెస్ సంస్థల నియంత్రణరహిత ఫ్యూచర్స్ ట్రేడింగ్‌కు, బ్లాక్ మార్కెటింగ్‌కు, బహిరంగ మార్కెట్ సేకరణకు, ఇత్యాది ఇతర కార్యకలాపాలకు యూపీఏ ప్రభుత్వం నీచమైన దుర్మార్గమైన సహకారం అందించి దళారిగా వ్యవహరించింది.

## నిత్యం కొనసాగుతున్న ఆకలి, పోషకాహార లోపం

భారతదేశంలో ఆకలి (హంగర్) 'ఆందోళనకరం'గా ఉందని అంతర్జాతీయ ఆహార పరిశోధన సంస్థ గుర్తించింది. నేషనల్ శాంపుల్ సర్వే (ఎన్ఎస్ఎస్) తాజా గణాంకాలు కూడా ఈ సమస్య దీర్ఘంగా మరియు విస్తృత పరిధిలో కొనసాగుతున్నట్లు తేల్చాయి. చాలా రాష్ట్రాల్లో ఈ దుస్థితి కనిపిస్తున్నా, బీజేపీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

### నిర్మూలించేది... ఆకలినా, ఆకలిపీడితులనా?

- సిఫారసు చేయబడిన దాని కంటే తక్కువ క్యాలరీలు తీసుకుంటున్న కుటుంబాలు గ్రామాల్లో 80 శాతం, అన్ని పట్టణ ప్రాంతాల్లో 64శాతం ఉండగా సిఫారసు చేసిన దానికంటే తక్కువ స్థాయిలో ప్రొటీన్లు తీసుకుంటున్న

కుటుంబాలు గ్రామాల్లో 54 శాతం, అన్ని పట్టణప్రాంతాల్లో 75 శాతం ఉన్నాయి.

- ✤ గ్రామీణ ప్రాంతాల్లోని 'తక్కువ స్థాయి బీదవారు' పొందుతున్న క్యాలరీల్లో 60శాతం, ప్రొటీన్లలో 55శాతం మాత్రమే 'అత్యంత బీదవారు' పొందగలుగుతున్నారు. పట్టణాల్లో ఈ 'అత్యంత బీదవారు' రెంటిలో 63 శాతం పొందుతున్నారు.
- ✤ పట్టణ ప్రాంతాల 'అత్యంత బీదవారి'కి అవసరమైన క్యాలరీల్లో 73శాతం, ప్రొటీన్లలో 70శాతం లభిస్తున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లోని పరిస్థితి మరీ హీనంగా ఉంది. అక్కడి అత్యంత బీదవారు వారికి అవసరమైన క్యాలరీల్లో ప్రొటీన్లలో 64 శాతం, 67 శాతం మాత్రమే పొందగలుగుతున్నారు.
- ✤ అధిక వృద్ధి రేటు ఉందని చెప్పుకుంటున్న బీజేపీ పాలిత గుజరాత్, కాంగ్రెస్ పాలిత మహారాష్ట్ర ఈ విషయంలో అత్యంత ఘోరమైన రాష్ట్రాలలో ఉన్నాయి.

ప్రభుత్వం ఇందుకు విరుద్ధమైన లెక్కలు చెప్పుకుంటున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో దినసరి క్యాలరీల వినియోగం 1972-73 లో 2,246 ఉండగా 2009-10 నాటికి అది 2020కి తగ్గిపోయింది. పట్టణ ప్రాంతాల్లో ఇదే సంఖ్య 2107 నుంచి 1946కి క్షీణించింది. ఎండెమిక్ హంగర్‌గా పేర్కొంటున్న నిత్య క్షుద్బాధ భారతీయ జనాభాలో గణనీయ భాగాన్ని ఇప్పటికీ పీడిస్తోంది.

పోషకాహార లేమి అన్ని తరగతుల వారిలో తీవ్రమైన హెచ్చు స్థాయిలో ఉంది. మరీ ముఖ్యంగా షెడ్యూల్డ్ తెగల్లో, మహిళల్లో ఈ సమస్య ప్రస్ఫుటంగా కనబడుతోంది. మొత్తం మీద చూస్తే, పిల్లల్లో పోషకాహార లేమి, అనారోగ్యం ఇంకా ఎక్కువగా ఉంటున్నాయి. దీన్ని గుర్తించడానికి మూడు ప్రమాణాలు తీసుకున్నారు. అవి: వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం (గిడసబారుట), ఎత్తుకు తగ్గ బరువు ఉండకపోవడం (చిక్కిపోవడం), వయసుకు తగ్గ బరువు ఉండకపోవడం (బరువు తక్కువ). అభివృద్ధి చెందుతున్న 40 ఇతర దేశాలలో కంటే భారత్‌లోనే బరువు తక్కువ పిల్లలు ఎక్కువ. వీరు మొత్తం పిల్లల్లో

48 శాతం ఉంటారు. ఆఫ్రికా సబ్‌సహారన్ దేశాలలో ఈ సమస్య ఉన్న పిల్లల సగటు శాతం 26 కాగా ఇండియాలో ఇది దాదాపు రెండురెట్లు అధికం.

**ప్రయోజనాలు నెమ్మదిగా అందడమా... ఆరోగ్యం కుప్పకూలడమా?**

- పసికందుల్లో మృత్యువాత శాతం 48.9కాగా, అయిదేళ్ల లోపు చిన్నారుల్లో ఈ శాతం 59.2.
- అయిదేళ్ల లోపు వయసు ఉన్న దాదాపు సగం మంది భారత చిన్నారులు (48శాతం) ఎడతెగని పోషకాహార లేమితో బాధపడుతూ, గిడసబారి ఉన్నారు.
- అయిదేళ్లలోపు వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరుచిక్కిపోయి ఉన్నారు. అంటే తమ వయసుకు ఉండాల్సిన దానికంటే బాగా సన్నగా ఉన్నారు.
- ఇదే వయసు పిల్లల్లో 43శాతం మంది తమ వయసుకు ఉండాల్సినట్లు కాకుండా బాగా బరువు తక్కువగా ఉన్నారు.
- 6నుంచి 59 నెలల మధ్య వయసు ఉన్న పసివారిలో ప్రతి పది మందికి ఏడుగురికి రక్త హీనత సమస్యఉన్నది.
- 36 శాతం మంది మహిళలు, 34 శాతం మంది పురుషులు తగినంత పోషకాహారం పొందలేకపోతున్నారు (అండర్ నరిష్డ్). వారి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 18.5 కంటే తక్కువగా ఉంది. వారిలో పోషకాహార లేమికి ఇది నిదర్శనం.
- మహిళల్లో సగం మందికి పైగా (55శాతం), పురుషుల్లో దాదాపు పావు వంతు మంది (24శాతం) మంది రక్తహీనతతో బాధ పడుతున్నారు.

## ఆహారాన్ని మింగేసిన ఇతర అత్యవసరాలు

ప్రజల తలసరి నెలవారీ నికర (ద్రవ్యోల్బణం పోను) వినియోగ వ్యయం 1972-73 నాటి రూ. 158 నుంచి 2009-10 నాటికి రూ. 220కి పెరిగినా క్యాలరీల

సగటు లభ్యత మాత్రం తగ్గింది. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలే పూర్తిగా ఇందుకు కారణం. వాటి ఫలితంగా ఆహార ధరలతో పాటు వైద్యం, విద్య, ప్రయాణికుల సరకుల రవాణా ఇంకా ఇతర అత్యవసర సేవల ధరలు పెరిగాయి. ఈ సేవల ప్రయివేటీకరణ ఇందుకు ముఖ్య కారణం. ప్రజలకు అందించాల్సిన విద్య, ఆరోగ్యం, సబ్సిడీ ఇళ్లు, రవాణా సదుపాయాలు, ఇంకా సామాజిక సేవల రంగాల నుంచి ప్రభుత్వం క్రమేణా వైదొలగుతున్నందు వల్ల కుటుంబ బడ్జెట్ల మీద ఒత్తిడి బాగా పెరిగిపోయింది. వీటి అధిక ధరల వల్ల ప్రజలు పోషక పదార్థాలు ఆహార పదార్థాల మీద ఖర్చులో కోత విధించుకోవలసిన తప్పనిసరి పరిస్థితి ఉత్పన్నమైంది.దీనికి తోడు ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా లభించే రేషను కూడా తగ్గటంతో వారి స్థితి మరింత దుర్భరంగా తయారైంది. ఫలితంగా మొత్తం వ్యయంలో ఆహారేతర అత్యవసరాల వ్యయం 2010లో  25శాతానికి హెచ్చింది. 1972–73లో ఇది 17 శాతం మాత్రమే ఉండేది.

అత్యధిక శాతం ప్రజానీకం చాలీచాలని ఆహార వినియోగంతో బతుకులు నెట్టుకొస్తున్న దేశంలో అందుబాటు ధరలకు ఆహార భద్రత కల్పించాల్సిన ఒక సార్వత్రిక విధానం తప్పనిసరి. దీన్ని ఏ ఒక్కడూ, ఆఖరుకు ఒక కఠినమైన ద్రవ్య నిపుణుడు సైతం కాదనలేడు. ఎడతెగని క్షుద్బాధ (ఎండెమిక్ హంగర్) భారత జనాభాలో భారీ సంఖ్యాకులను ఇప్పటికీ బాధిస్తోంది. 2013 యూఎన్‌డీపీ మానవ అభివృద్ధి సూచీలో ఇండియా మొత్తం 199 దేశాలలో 94వ ర్యాంకులో ఉంది. అయినప్పటికీ, ప్రజలందరికీ ఒకే సబ్సిడీ ధరకు ఆహారం అందించే విధంగా దాదాపు సార్వత్రిక ఆహార భద్రత వ్యవస్థను భరించేందుకు కావల్సిన ఆహారం గానీ ఆర్థిక వనరులు గానీ దేశంలో సరిపడా లేవని కాబట్టి అది సాధ్యపడదని ప్రభుత్వం చెబుతోంది. ఇంతకు మించిన మోసం మరొకటి ఉండదు!

## ఆహార ధాన్యాలు చాలవనడం కట్టుకథ

**ప్రభుత్వ అబద్ధం #1 : <u>సరఫరాల ప్రతిబంధకం :</u>** సబ్సిడీతో కూడిన సార్వజనీన వ్యవస్థకు సరఫరా చేయాల్సిన పరిమాణంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి, లభ్యత లేదు.

**అసలు వాస్తవం... సరఫరాల ప్రతిబంధకం కాదు, మితిమీరిన నిల్వలు!** వ్యవసాయ రంగం రుణాల ఊబిలో ఉన్నప్పటికీ (పెరుగుతున్న ఆత్మహత్యలు, సాగు నుంచి తప్పుకోవడం ఇందుకు నిదర్శనం) 2000ల మధ్య నుంచి ఉత్పత్తిలో వృద్ధి ఉంది. ఫలితంగా, 2012-13 వ్యవసాయ సంవత్సరంలో ధాన్యం దిగుబడి 255.4 మిలియన్ టన్నుల రికార్డు స్థాయికి చేరింది. ప్రస్తుత సంవత్సరానికి ఇది 263 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. ఇండియా వాస్తవ సామర్థ్యానికంటే ఇది చాలా తక్కువే అయినప్పటికీ, ఈ సరఫరా ఏ విధంగా చూసినా అవసరానికి చాలదనడం ఎంత మాత్రం సరికాదు.

అందుబాటు విషయానికి వస్తే తల ఒక్కింటికి (నికర ఎగుమతులు, విత్తనాలు, దాణా, వృధా అన్నీ పోను) చాలా తక్కువగా 2011లో 164.9 కేజీలు ఉంది. 2008 గరిష్ట స్థాయి 171 కేజీల కంటే బాగా తక్కువ. కాబట్టి ఆహార ధాన్యాలలో మిగులు ఉత్పత్తి లేనేలేదు.

**పొంగిపొర్లుతున్న ధాన్యాగారాలు, ఖాళీ కడుపులు!** ప్రభుత్వ ధాన్యసేకరణ చాలా ఎక్కువ. పైగా పెరుగుతోంది. 2005-06లో 42 మిలియన్ టన్నులు సేకరించగా, 2012-13లో ఇప్పటి వరకు జరిపిన సేకరణ 42.8 మిలియన్ టన్నులు (ఇది రబీ సేకరణ కంటే ముందు సంఖ్య). ప్రభుత్వానికి ఈ పెరుగుతున్న ఆహార నిల్వలు తలకు మించిన భారంగా అవుతున్నాయి. ఇవి నిల్వల నియమాల కంటే కూడా చాలా ఎక్కువ. చివరకు వీటిని పంపిణీ చేయడం సమస్యాత్మకంగా మారింది. ప్రస్తుత నిల్వలు సరఫరాల పరిస్థితి అవసరానికి మించి సౌకర్యదాయకంగా ఉంది. రబీ తర్వాత ఇది మరింత మెరుగు అవుతుంది. కాబట్టి దేశవ్యాప్తంగా బాగా ఎక్కువ మంది ప్రజలకు కనీస మొత్తం చొప్పున ఆహార ధాన్యాలను అందుబాటు ధరలకు పంపిణీ చేయడం ద్వారా, ఈ క్రమంలోనే పీడీఎస్‌ను విస్తరించడం ద్వారా సార్వత్రీకరణ వ్యవస్థ ప్రవేశపెట్టాలని వాదించడానికి ఈ పరిస్థితి సువర్ణావకాశం కల్పించింది. ఇది ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టింది. పరిహాసం పాలైంది కూడా. ఎందుకంటే ఒక వంక దేశవ్యాప్తంగా గోదాముల్లో ధాన్యం మురిగిపోతూ ఉంటే , చాలా చోట్ల తగినన్ని గోదాములు లేక ఆరుబయట ఉంచిన నిల్వలు ఎలుకలకు పందికొక్కులకు ఆహారమవుతూ ఉంటే, మరోవంక నిత్యం మిలియన్ల మంది ఆకలితో

అలమటిస్తూ ఉండటం... ఈ పరిస్థితి ప్రభుత్వాన్ని నవ్వులపాలు జేసింది.. ఈ అర్థరాహిత్యాన్ని, ముగిగిపోయే నిల్వలను, ఆకలి, పోషకాహార లేములను ఎలా అర్థం చేసుకోవాలి?

జూన్ 2013లోని 77 మిలియన్ టన్నుల నుంచి (2012జూన్ లో ఉన్న రికార్డు స్థాయి 82 మిలియన్ టన్నుల నుంచి) ధాన్యం నిల్వలు ప్రస్తుతం 42.7 మిలియన్ టన్నులకు దిగి వచ్చాయి. 2012-13లో 56.36 మిలియన్ టన్నులను కేటాయించగా అందులో రాష్ట్రాలు తమ కోటా కింద తీసుకున్నది 55.8 మిలియన్ టన్నులు. మరయితే కేటాయింపులు ఆఫ్‌టేక్‌లు (తీసుకోవడాలు) ఎదుగూబొదుగూ లేకుండా ఉన్నప్పటికీ, నిల్వలు ఎలా తగ్గాయి?

**ఇండియా ఎలుకల తర్వాత ప్రభుత్వ ప్రాధాన్యత విదేశీ పశువులు, పందులకే!** ప్రభుత్వం తన కోట్లాది జనబాహుళ్యాలకు తిండి సమకూర్చడానికి బదులు సిగ్గూఎగ్గూ లేకుండా ఎగుమతి చేసింది. ఒక్క ఏడాదిలో (2012-13లో) 10 మిలియన్ టన్నులు, 2013-14లో మొదటి 8 నెలల్లో 3 మిలియన్ టన్నులను అంటే 20 నెలల్లో మొత్తం 13 మిలియన్ టన్నులను వేలం వేసింది! అమ్మేసిన ఈ ఆహారధాన్యాలు ఎలా ఉపయోగపడ్డాయో తెలుసా? ధనిక దేశాలు వీటిని పశువులకు దాణా కింద వాడాయి. ఈ విధంగా ప్రభుత్వం తన ఆహార భద్రత ధ్యేయాన్ని నెరవేర్చడానికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాల కేటాయింపులను పెంచకపోగా అభివృద్ధి చెందిన దేశాల పశువులను మేపేందుకు వాటిని ఎగుమతి చేసింది.

## నిధుల కొరత కట్టుకథ

**ప్రభుత్వ అబద్ధం # 2 : <u>నిధుల అవరోధం</u> :** సార్వత్రిక సబ్సిడీ ధాన్యాల పథకం చాలా ఖరీదైన వ్యవహారం, భరించలేనిది. ప్రభుత్వం వద్ద అందుకు అవసరమైనంత డబ్బు లేదు.

అన్నార్తులకు ఖాళీ ఖజానా, ధనికులకు ఎన్నో రాయితీలు! ఆఫ్‌టేక్‌ను పెంచాలంటే, పీడీఎస్ కింద విక్రయించే ఆహార ధాన్యాల,నిత్యావసరాల ధరలు తక్కువ పెట్టడం తప్పనిసరి.

ఆకలిని నిర్మూలించాలంటే, ప్రతిఒక్క భారతీయుడికీ వర్తించే విధంగా అన్ని నిత్యావసర వస్తువులను అందించే సార్వత్రిక పీడీఎస్ కీలకం. అయినా మతిలేకుండా ప్రభుత్వం సబ్సిడీలలో కోత పెట్టే విధానాలు పాటిస్తోంది. లక్షిత పీడీఎస్ (టీపీడీఎస్) విధానం కింద దేశ జనాభాను అత్యల్ప సంఖ్యాక కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్), అత్యధిక సంఖ్యాకకుటుంబాలను దారిద్ర్య రేఖకు ఎగువన (ఏపీఎల్) అంటూ రెండుగా విభజించింది. సబ్సిడీలను భారీగా తగ్గించే దిశలో ఈ టీపీడీఎస్ మొదటి అడుగు. ఇక పేద ప్రజలను తప్పుడు పద్ధతిలో  అన్నార్తులను అన్యాయంగా, ఏకపక్షంగా ఏపీఎల్‌లోకి వచ్చేట్లు వేరు చేయడం, ఏపీఎల్ తరగతిగా పరిగణించబడిన ఈ పేదలకు సబ్సిడీలు భారీగా తగ్గించి తద్వారా అధిక ధరలకు వారికి ఆహార పదార్థాలు అమ్మజూపడం రెండో అడుగు. ఇక ఏపీఎల్ జనాభాను కూడా చేర్చి పటిష్టమైన, దాదాపు  సార్వత్రికమైన పీడీఎస్ వ్యవస్థ అమలు చేస్తున్న రాష్ట్రాలకు నష్టం జరిగేలా రాష్ట్రాల సబ్సిడీ లింకు కోటాల కేటాయింపులపై ఆంక్షలు విధించడం మూడో అడుగు. పెరుగుతున్న ధరలతో లేదాపెరుగుతున్న జీడీపీతో సమంగా పెరగాల్సిన సబ్సిడీ బిల్లును తగ్గించడానికి ఈ మూడింటినీ సంధించింది కేంద్రప్రభుత్వం. దీని వల్ల నిర్హేతుకంగా అన్యాయంగా భారీ సంఖ్యలో ఆకలిపీడితులను, పోషకాహారం లోపించిన వారిని పీడీఎస్ నుంచి 'లక్షిత' పేరు చెప్పి తప్పించారు.

అత్యంత దిగ్భ్రాంతికరమైన మరో అంశం ఏమిటంటే, బీపీఎల్ రేఖను ఎంత దిగువకు పెట్టారంటే గ్రామీణ భారతదేశంలో రోజుకు 26 రూపాయలు, పట్టణ భారతదేశంలో రోజుకు 32 రూపాయలు దాటిన ఆదాయం ఉన్నవారంతా ఇందులోకి రారు. దీంతో క్రమేణా పెద్ద సంఖ్యలో బీదప్రజలు బీపీఎల్ తరగతి నుంచి బయటకు వచ్చారు.

కొందరికే పీడీఎస్, ఆహారానికి అధిక ధరలు.. వీటి వెనుక ఉన్న వాస్తవ ధ్యేయం వ్యయాల కోత, ద్రవ్యలోటు తగ్గింపులు. ద్రవ్యలోటు ఇంతకు మించరాదన్న హాస్యాస్పద భావనను కాసేపు అంగీకరించామే అనుకుందాము.. అప్పుడు పద్ధతి ఇది కాదు. దీన్ని సాధించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఇవేమిటంటే.. పన్నులు పెంచి మరిన్ని అధిక వనరులు సమీకరించడం ద్వారా, పన్ను మినహాయింపులను తగ్గించడం. తద్వారా కీలకమైన వ్యయాలకు నిధులు సమకూర్చవచ్చు. కాని ఈ వ్యూహం అమలు చేయడం ఈ ప్రభుత్వానికి సాధ్యపడదు. ఎందుకంటే సామాన్య జనాల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు అవసరమైన నిధులు సమీకరించడం కంటే ఇన్వెస్టర్లకు మరీ ముఖ్యంగా విదేశీ ఇన్వెస్టర్లకు దోచిపెట్టడమే పరమార్థంగా అది పనిచేస్తోంది.

అభివృద్ధి చెందిన చాలా దేశాలతో పోల్చితే, ఇండియా యొక్క పన్ను-జీడీపీ నిష్పత్తి కేవలం 15 శాతం. (ద.ఆఫ్రికా 26శాతం, రష్యా 23 శాతం, బ్రెజిల్ 25.4 శాతం, చైనా 18.9 శాతం, యూఎస్ 28 శాతం, స్కాండినేవియా దేశాలు 45-50 శాతం). నిధుల సమీకరణలో ఈ ఘోర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోడానికి, ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకోకుండా ప్రస్తుత ధరల వద్ద ఇస్తున్న సబ్సిడీల గణాంకాలు ప్రభుత్వం ఏకరువు పెడుతుంది. జీడీపీ వృద్ధి రేటును ప్రస్తావించాల్సిన అవసరాన్ని కూడా అది నిర్లక్ష్యం చేస్తోంది.

వాస్తవం ఏమంటే ఒక్క సంవత్సరం తప్ప అత్యధిక సంవత్సరాల్లో సబ్సిడీలు జీడీపీలో 1 శాతం కంటే తక్కువే ఉంది. పైగా, 2000లలో కార్పొరేట్ల లాభాలు, పన్ను పడే ఆదాయాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నప్పుడు కూడా పన్ను రాయితీల శాతం ఇంతకు ఎన్నో రెట్లు ఉంది. కార్పొరేట్ లాభాలపై ఇచ్చిన పన్ను రాయితీలే చాలా సంవత్సరాల్లో ఆహార సబ్సిడీలను మించిపోయాయి. పన్ను రాయితీలు అన్నీ కలిపితే అవి జీడీపీలో 5 నుంచి 8 శాతం వరకు ఉంటాయి. లేదా రూపాయల్లో చెప్పాలంటే 4 నుంచి 6 లక్షల కోట్ల రూపాయలు అవుతాయి. సార్వత్రిక పీడీఎస్‌కు అవసరమైన అంచనా వ్యయం ఈ వదిలేసుకున్న పన్నుల్లో సుమారు మూడో వంతు మించదు. కాబట్టి ఇది భరించలేని భారం ఎలా అవుతుంది? సమస్య డబ్బు లేకపోవడం కాదు, సామాజిక ప్రాధాన్యతలను తుంగలో తొక్కడమే. వ్యవస్థలో పోగుపడే మిగులును కొంతైనా సమీకరించాలన్న, ఏ వర్గాలకైతే అది అత్యంత అవసరమో వారికి కేటాయించాలన్న చిత్తశుద్ధి కొరవడటమే అసలు సమస్య.

## గుజరాత్‌లో మోడీ

గుజరాత్‌లో నరేంద్ర మోడీ ప్రభుత్వ చరిత్ర కూడా సామాజిక ప్రాధాన్యతల నడ్డివిరవడంలో మరీ ముఖ్యంగా ఆహార భద్రత కల్పించే విషయంలో ఇంతే లజ్జాకరంగా ఉంది. ఆయన మాట్లాడితే 'వెలిగిపోతున్న గుజరాత్' అంటారు. గుజరాత్‌లో భారీ పెట్టుబడుల గురించి గొప్పలు చెప్పుకుంటారు. కాని వీటి ప్రయోజనాలేవీ బీదలకు చేరలేదు. మరోవంక వామపక్ష పాలిత రాష్ట్రాలతో సహా అనేక రాష్ట్రాల్లో అనేక చోట్ల ప్రభుత్వ పరిమిత వనరులను

ఆహార భద్రతను మరింత ఎక్కువ మందికి విస్తరించడానికి వినియోగించగా, మోడీ పాలనలోని గుజరాత్ ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోలేదు. కేరళలో ఎల్‌డిఎఫ్ పాలనలో చాలా ఎక్కువ మంది ప్రజలు కిలో రెండు రూపాయలకు బియ్యం పొందగలుగుతున్నారు. కాని అత్యంత ధనిక రాష్ట్రంగా చెప్పబడే గుజరాత్‌లో మాత్రం మోడీ గారు బీపీఎల్ ప్రజలకు మొండి చేయి చూపించారు. 25 కిలోల గోధుమలకు కేవలం 13 కిలోలు మాత్రమే రెండు రూపాయలకు ఇచ్చి మిగిలిన 12కిలోలను రూ. 5.40 వసూలు చేశారు. బియ్యం పది కేజీలు ఇచ్చి అందులో మూడు కిలోలు మూడు రూపాయలకు, 7 కిలోలు  కిలో ఏడు రూపాయలకు ఇచ్చారు. అలా 35 కిలోల గోధుమ బియ్యాలకు ఒక బీపీఎల్ కార్డుదారుడు 150 రూపాయల వరకు చెల్లించాల్సి వస్తోంది. అదే వామపక్ష పాలిత ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో బీపీఎల్ కార్డుదారుడు మొత్తం తను పొందే మొత్తం రేషనుకు కిలో రెండు రూపాయల వంతునే చెల్లించాడు. గుజరాత్ వంటి రాష్ట్రానికి ఇది ఎంత అవమానకరం!

ఆఖరుకు ఉత్తర ప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు కూడా పోషకాహార లేమి స్థాయి గుజరాత్‌లో చాలా ఎక్కువ. గుజరాత్‌లో బాల పోషకాహార లేమి స్థాయి చత్తీస్‌గఢ్, ఒరిస్సాలతో సమానంగా ఉంది. ఇటీవలి యూనిసెఫ్ నివేదిక ప్రకారం, "గుజరాత్‌లో సమీకృత ఆహారం కొరవడటం వల్ల ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకడు పోషకాలలేమితో, ప్రతి నలుగురిలో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారు. గుజరాత్‌లో ప్రతి ముగ్గురు తల్లుల్లో ఒకరు తీవ్రమైన పోషకాహార కొరత ఎదుర్కొంటున్నారు."

భారత ప్రభుత్వం విడుదల చేసిన ఇండియా బాలల నివేదిక (2012) ప్రకారం, శిశు మరణాల రేటు ఎంత ఉందనేది సామాజిక పురోగతిని ప్రతిబింబించే మౌలిక సూచీల్లో ఒకటి. శిశు మరణాల రేటు గుజరాత్‌లో అత్యధికంగా 1000కి 44 ఉంది. అన్ని రాష్ట్రాలలో గుజరాత్ ఈ విషయంలో 11వ ర్యాంకు. గుజరాత్ మహిళలు తీసుకునే ఆహారమే దీని కారణమని ముఖ్యమంత్రి మోడీ అర్థరహితమైన ఒక ప్రకటన చేశారు. "వెలిగిపోతున్న గుజరాత్"లో బీదలు, శ్రామిక వర్గ ప్రజల పట్ల ఆయన చిన్నచూపుకు ఇది నిదర్శనం.

## జాతీయ ఆహార 'అ'భద్రత చట్టం: చేజారిన అవకాశం

'100 రోజుల' హామీకి కాలం తీరి నాలుగేళ్లు గడచిన తర్వాత, ప్రభుత్వం వద్ద కనీసంగా ఉండాల్సిన నిల్వకు నాలుగు రెట్లు అధికంగా 70 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు ఉన్న సమయంలో, జాతీయ ఆహార భద్రత చట్టం చివరకు పార్లమెంటు

ఉభయసభల ఆమోదం పొందింది. ఇంత మిగులు నిల్వలతో సరఫరాకు ఢోకా లేని ఈ పరిస్థితి ఒక చరిత్రాత్మక అవకాశం. అయినప్పటికీ, ఈ చట్టం అవసరమైన స్థాయిలో లేదు. 67 శాతం భారతీయ కుటుంబాలకు నెలకు కేవలం 5 కేజీల ఆహార ధాన్యాల సరఫరాకే ఇది గ్యారెంటీ ఇస్తోంది. ఈ కుటుంబాలు గ్రామాలలో 75 శాతం, పట్టణాలలో 50 శాతం ఉంటాయి. ఐసీఎంఆర్ సిఫారసు చేసిన 14 కిలోల అవసరానికంటే 5 కిలోలు చాలా తక్కువ. తృణ ధాన్యాలు మాత్రమే అనేది అరకొర విధానం. ఆహార భద్రత కిందకు పంచదార, పప్పుధాన్యాలు, నూనె, ఇతర నిత్యావసర వస్తువులను చేర్చలేదు. అలాగే మూడో వంతు భారతీయులను విస్మరించడం దేశంలో విస్తృతంగా నెలకొన్న పోషకాహార లేమి దృష్ట్యా ఇది సమర్థనీయం కాదు. పన్ను చెల్లింపుదారులను మాత్రమే ఈ చట్టం నుంచి మినహాయిస్తే సరిపోతుందని సీపీఐ(ఎం) చేసిన డిమాండును ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా ఆహార భద్రత సార్వత్రిక హక్కుకు చట్టపరమైన గ్యారెంటీ ఇవ్వకపోగా ఆహార అభద్రత ఎదుర్కొంటున్న తరగతులను నిర్హేతుకంగా మినహాయించడం, సామాజిక ఆర్థిక కులాల జనాభాతో ప్రణాళికాసంఘం అంచనాలతో ముడిపెట్టి పాత లక్షిత పీడీఎస్‌ను కొత్త తరహాలో కొనసాగించడం జరుగుతోంది.

ఇప్పటికే ఒక పక్క అన్ని నిత్యవసరాల ధరలు నిరంతరాయంగా పెరిగిపోతూ మరోవంక సర్వవ్యాపితమైన ఆకలి, పోషకాహార లేమి సమస్యలు కుంగదీస్తూ ఉండగా యూపీఏ ప్రభుత్వం ప్రజలపై మరింత భారం మోపుతూ ఇలా పెదధోరణి ప్రదర్శిస్తోంది. ఆహార భద్రత , ధరల అదుపు రంగాలలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం కనబరచుతున్న పనితీరు నిరాశాపూరితంగా ఉండటంతో, సీపీఐ(ఎం) కొన్ని డిమాండ్లను చేసినా వాటిని యూపీఏ ప్రభుత్వం పదేపదే తిరస్కరించింది. అవి:

- ఇంధన ధరల పెంపు వెనక్కు తీసుకోవాలి, పెట్రో ఉత్పత్తులపై పరోక్ష పన్నులను తగ్గించాలి, డీకంట్రోల్‌ను తొలగించాలి.
- ఎరువుల ధరలను సబ్సిడీ పెంచి అదుపులో ఉంచాలి.
- ఫుడ్ సబ్సిడీని పెంచడం ద్వారా ధరలు మరింత అందుబాటులో ఉండేలా పీడీఎస్‌ను సార్వత్రీకరించాలి, విస్తరించాలి.

- చక్కెర, గోధుమ, ఇతర నిత్యావసర సరుకులలో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను నిషేధించాలి, అక్రమ నిల్వదారులను కఠినంగా శిక్షించాలి.
- పెట్టుబడుల ప్రవాహాల ఒడిదుడుకులను నియంత్రించే కఠినమైన ఫలితం ఇచ్చే చర్యలు చేపట్టాలి, రూపాయి విలువను స్థిరంగా నిలబెట్టాలి.

కొన్ని ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు మాత్రమే ధరల స్థిరత్వాన్ని, పోషకాహారం లభించని మిలియన్ల మందికి ముఖ్యంగా మహిళలు పిల్లలకు ఆహార భద్రతను సమకూర్చగలవని సీపీఎం(ఎం) ప్రకటిస్తోంది.

బీజేపీగానీ, కాంగ్రెస్ గానీ అలాంటి ప్రత్యామ్నాయ విధానాలు అందించలేవు.

ఆహార భద్రత అంశానికి శాశ్వత ప్రాముఖ్యతను కల్పించడానికి, ఆహార సబ్సిడీ పెంపునకు, పీడీఎస్‌ను సార్వత్రీకరించడానికి, పటిష్టపరచడానికి, ధరల పెరుగుదలను అదుపుచేయడానికి, ఆకలిని పోషకాహార లేమిని అంతమొందించడానికి సీపీఐ(ఎం), వామపక్షాలు కట్టుబడి ఉన్నాయి.

**సిపిఐ (ఎం) కు ఓటు వేయండి**

**కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం కోసం**

**వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలపరచండి.**


**వెల :₹ 2/-**

ప్రచురణ కర్త :

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరపున
జె. జయరాం, హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్,
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20